క్లుప్తంగా

వ్యాపార భాగస్వామ్యాలు అత్యంత కీలకం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ ఆర్థికాభివృద్ధిలో వ్యాపార భాగస్వామ్యాలు ఎంతో కీలకమని విజయవాడ డివిజన్ సీనియర్ డీసీఎం బి.ప్రశాంత్‌కుమార్ పేర్కొన్నారు. వ్యాపార భాగస్వామ్యాల బలోపేతం దిశగా గురువారం విజయవాడ డీఆర్‌ఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాలులో 'బిజినెస్ డెవలప్‌మెంట్ మీట్' నిర్వహించారు. సీనియర్ డీసీఎం మాట్లాడుతూ విజయవాడ డివిజన్ పరిధిలో వాణిజ్య అవకాశాలు, వ్యాపారుల సహకారం వృద్ధిని పెంపొందించడమే ఈ సమావేశం లక్ష్యమన్నారు. సరుకు రవాణా వృద్ధి చేసేందుకు డివిజన్ కొత్త వ్యాపార అవసరాలను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. విశ్వసనీయమైన భాగస్వామ్యం అందించేందుకు విజయవాడ డివిజన్ నిబద్ధతతో ఉందని, వ్యాపారుల పరస్పర అవగాహనతో వ్యూహాత్మక ప్రణాళికల కోసం ఈ వేదిక ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వస్తువుల రాకపోకలు, పార్శిల్ సేవలు, పార్శిల్ కార్గో ఎక్స్‌ప్రెస్ రైళ్లు, నాన్ ఫేర్ రెవెన్యూ వ్యాపారులతో చర్చించారు. ఈసందర్భంగా పెరుగుతున్న డిమాండ్‌కు తగినట్టుగా మరిన్ని పార్శిల్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని వ్యాపారులు కోరగా, అందుకు డీసీఎం సానుకులంగా స్పందించారు. ఈ మేరకు తగిన ఏర్పాట్లు చేయనున్నట్లు హామీ ఇచ్చారు. సమావేశంలో రైల్వే అధికారులు, వ్యాపారులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యంపై ఫిర్యాదు



భవానీపురం(విజయవాడపశ్చిమ): జక్కంపూడి వైఎస్సార్ కాలనీకి చెందిన ఓ బాలుడు అదృశ్యంపై కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. వైఎస్సార్‌కాలనీలోని బ్లాక్ నంబర్ 200లోని మూడవ ఫ్లోర్‌లో నగరపాలక సంస్థలో పనిచేస్తున్న వేముల లక్ష్మి తన కుటుంబసభ్యులతో కలిసి నివసిస్తోంది. ఆమె తమ్ముడు కొడుకు వల్లెపు శ్రీను(13) ఈనెల 27వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో తండ్రితో కలిసి వినాయకుని బొమ్మల దగ్గరకు వెళ్లాడు. అక్కడ డాన్స్‌లు వేస్తుంటే బాలుడి తండ్రి మందలించి ఓ దెబ్బవేశాడు. దీంతో ఆ బాలుడు లక్ష్మి ఇంటికి వెళ్లగా, అమ్మమ్మ ఇంటికి వెళ్లమని ఆమె చెప్పింది. దీంతో అక్కడి నుంచి వెళ్లిన బాలుడు తిరిగి ఇంటికి చేరలేదు. బాలుడి మేనత్త లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండున్నర కిలోల గంజాయి స్వాధీనం

భవానీపురం(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీసులు ఇద్దరు యువకులను అరెస్ట్ చేసి వారి వద్ద ఉన్న సుమారు రెండున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. గురువారం టూ టౌన్ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు చిట్టినగర్ ఫోర్‌మెన్ బంగ్లా, రైల్వేక్వార్టర్స్ వద్ద గంజాయి విక్రయించేందుకు యత్నిస్తున్న కొత్తపేటకు చెందిన చిట్టిపోయిన శ్రీకాంత్ అలియాస్ నంది అలియాస్ తమ్మి (24), అదే ప్రాంతానికి చెందిన కట్టా తరుణ్‌సాయి అలియాస్ నల్ల తరుణ్ (23)లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండున్నర కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. ఈ మేరకు టూటౌన్ సీఐ ఎస్.కొండలరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


పశ్చిమలో కుండపోత వర్షం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలో బుధవారం కుండపోతగా వర్షం కురవడంతో జనజీవనం అస్తవ్యస్థమైంది. ప్రధానంగా బుధవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ ఎడతెరపి లేకుండా కురిసిన వర్షంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో నియోజకవర్గంలోని దాదాపుగా అన్ని లోతట్టు ప్రాంతాల్లోనూ వర్షపునీరు నిలిచిపోయింది. ప్రధానంగా గణపతిరావురోడ్డు, సుబ్బరామయ్యవీధి, గులాం మొహిద్దీన్‌వీధి, కేటీరోడ్డు ప్రాంతాల్లో భారీగా వర్షపునీరు ప్రవహించింది. జెండాచెట్టు వద్ద ఉన్న ప్రధాన అవుట్ ఫాల్ డ్రైన్ పూర్తిగా నిండి ప్రవహించింది. వినాయకచవితి పూజాసామగ్రిని విక్రయించుకునేందుకు వచ్చిన శివారు గ్రామాల ప్రజలు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. వర్షం దెబ్బకు పండుగ వాతావరణం దెబ్బతినడంతోపాటు జనం అవస్థలుపడ్డారు.

సంగీతోత్సవాలు ప్రారంభం

విజయవాడకల్చరల్: లయనాథ కళా ప్రవంతి ఆధ్వర్యంలో సంగీత విద్వాంసులు లంకా వెంకటేశ్వర్లు సంగీత సేవలను గుర్తు చేసుకుంటూ శివరామ కృష్ణ క్షేత్రంలోని శ్రవణ సదనంలో ఐదు రోజులపాటు నిర్వహించే సంగీతోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. యువ సంగీత కళాకారులు కేవీ కిషోర్, బీవీ రఘునాథ ప్రణద, సాత్విక, సీనియర్ సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ బీవీఎస్ఎస్ కృష్ణ, శ్రీరంజని, నాగపూజిత కృతులను ఆలపించారు. యువ సంగీత కళాకారులకు వేదిక కల్పిస్తున్నట్లు సంస్థ నిర్వాహకురాలు మాధవి తెలిపారు.



మార్వాడీ సంఘం ఆధ్వర్యంలో కొలువుదీరిన గణపతి



పూలబావివీధిలో వినాయకుడు



పూజారి వారి వీధిలో అద్దాల గణపతి



కొత్తపేట కుమ్మరి వారి వీధిలో గణపతి



కృష్ణవేణి మార్కెట్‌లో విఘ్నేశ్వరుడు

వైభవంగా విఘ్నాధిపతికి పూజలు

- వీధివీధినా అంబరాన్నంటిన చవితి వేడుకలు
- విశేష పూజలు నిర్వహించిన భక్తులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తొలిపూజను అందుకొని విఘ్నాలను తొలగించే గణనాథుని వేడుకలు బుధవారం పశ్చిమ నియోజకవర్గ వ్యాప్తంగా అత్యంత ఘనంగా నిర్వహించారు. పాతబస్తీలో వాడవాడలా వినాయక చవితి వేడుకలను వివిధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించి ఆ ముషికవాహనుడి ఆశీస్సులందుకున్నారు. అడుగు నుంచి 15 అడుగుల వరకూ వివిధ స్వరూపాల్లో విభిన్న ఆకృతుల్లో గణపయ్య విగ్రహాలు భక్తులను కనువిందు చేశాయి. వ్యాపార సంఘాలు, మిత్ర బృందాలు, ఆలయాలు, కాలనీ కమిటీలు ఇలా వివిధ రూపాల్లో ఏర్పడ్డ బృందాలు గణపతిని పూజించి స్వామి వారి ఆశీస్సులందుకున్నారు. వన్‌టౌన్‌లోని పూలబావివీధిలో 15 అడుగుల మేర భారీ గణనాథుని ప్రతిమను ఏర్పాటు చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అలాగే కందులవారివీధిలోని శ్రీ గణేష్ ఉత్సవ సమితి(మార్వాడీ సంఘం) ఆధ్వర్యంలో ఉత్తర భారతదేశంలో సంప్రదాయానుసారం ప్రత్యేక రూపంలో నందిని అధిరోహిస్తున్న గణపతిని ఏర్పాటు చేశారు.

భారీ గణనాథులు

వన్‌టౌన్‌లో ఏర్పాటు చేసిన భారీ గణనాథులు భక్తులను ముచ్చటగొలుపుతున్నాయి. వివిధ రూపాల్లోని గణపతి, పరమశివుని స్వరూపాలను ఏర్పాటు చేసి అలరింపజేశారు. వాటిని చూడటానికి పెద్ద సంఖ్యలో భక్తులు బారులు తీరారు. వస్త్రలత ప్రాంగణం, కృష్ణవేణి హోల్‌సేల్ క్లాత్ మార్కెట్ కాంప్లెక్స్‌లో భారీ గణనాథుల విగ్రహాలను వ్యాపారులు ఏర్పాటు చేసి వైభవంగా ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. పూలబావివీధిలో ఉమా పుత్ర సేవా సమితి ఆధ్వర్యంలో భారీ గణపతిని ఏర్పాటు చేశారు. వాటితో పాటుగా పాతబస్తీలోని జిల్లా, నగర సంఘాలు ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల్లో భారీ గణపతి విగ్రహాలను ఏర్పాటు చేశారు. రాయల్ హోటల్ సెంటర్, కోమలవిలాస్, మల్లికార్జునపేట సహా అన్ని ప్రాంతాల్లో ఆయా సంఘాల ఆధ్వర్యంలో భారీ గణనాథుని విగ్రహాలను ఏర్పాటు చేశారు. వన్‌టౌన్‌లోని వివిధ ప్రాంతాల్లో భారీ గణనాథులు కొలువుదీరి పూజలందుకున్నారు.



కోమలవిలాస్ సెంటర్‌లో పూజలు నిర్వహిస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు



వినాయక చవితి పూజలు చేస్తున్న శీనా నాయక్ దంపతులు

కిటకిటలాడుతున్న పందిళ్లు

వినాయక చవితి వేడుకల సందర్భంగా ఆయా పందిళ్లలో వేంచేసి ఉన్న వినాయకుని విగ్రహాలను చూసేందుకు ప్రజలు బారులు తీరారు. పాతబస్తీలోని సమ్మెటవారివీధి, పూజారివారివీధి, పూలబావి సందు, కందులవారివీధి, వస్త్రలత, మెయిన్ బజార్ తదితర ప్రాంతాల్లో ఉన్న స్వామి వారి విగ్రహాలను దర్శించుకునేందుకు వన్‌టౌన్‌వాసులు కుటుంబ సభ్యులను తీసుకొని తరలిరావడంతో ఆయా ప్రాంతాలన్ని బుధ, గురువారాలు సాయంత్రం కళకళలాడుతూ కనిపించాయి.

పలువురు ప్రముఖులు పూజలు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు, పార్టీ నేత పోతిన వెంకటమహేష్, సీఐడీ డీజీ రవిశంకర్‌అయ్యార్ వన్‌టౌన్‌లోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథుని ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా హాజరై వేడుకలను ప్రారంభించారు. అలాగే కందులవారివీధిలోని గణపతికి పూజలు నిర్వహించారు.

ఆలయాల్లో గణపతి ఉత్సవాలు ప్రారంభం

పాతబస్తీలోని వివిధ గణపతి ఆలయాల్లో వినాయకచవితి ఉత్సవాలు బుధవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. నగరంలోని కెనాల్‌రోడ్డులో కొలువై ఉన్న పురాతన ఆలయమైన శ్రీ వినాయకస్వామి దేవస్థానంలో ఉత్సవాలకు బుధవారం శ్రీకారం చుట్టారు. తొలి రోజు తెల్లవారుజాము నుంచి స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. అలాగే శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం(పాతశివాలయం)లో కొలువై ఉన్న శ్రీ వినాయకదేవస్థానంలో స్వామి వారి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను, సాయంత్రం భజన, రాత్రి స్వామి వారికి పల్లకీ సేవను నిర్వహించారు. వస్త్రలత ప్రాంగణంలో ఉన్న గణపతి ఆలయంలోనూ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శేషయ్య వీధిలోని కొత్తగుళ్ల ప్రాంగణంలో ఉన్న గణపతి ఆలయంలోనూ ఉత్సవాలను ప్రారంభించారు.

ఇంద్రకీలాద్రిపై చవితి పూజలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వినాయక చవితి పండుగ సందర్భంగా ఇంద్రకీలాద్రిపై బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీనటరాజ స్వామి ఆలయం, చిన్న రాజగోపురం ముందు కొలువై ఉన్న గణపతి స్వామికి పూజలు చేశారు. ఉదయం 8 గంటలకు విఘ్నేశ్వర పూజ నిర్వహించిన అనంతరం కలశ స్థాపన, విశేష పత్రి పూజ, శ్రీగణపతి హోమం ఘనంగా జరిగాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి శీనానాయక్ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ స్థానాచార్యులు శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు శ్రీధర్ శర్మ, వైదిక క్రతువులు నిర్వహించారు.



పాతశివాలయంలో స్వామివారి ఊరేగింపు



సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యార్‌ను సన్మానిస్తున్న కందులవారివీధి నిర్వాహకులు



దక్షిణామూర్తిగా బాలగణపతి

బాలగణపతి ఆలయంలో..

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ పాతబస్తీలోని బాలగణపతి మందిరంలో స్వామివారు గురువారం దక్షిణామూర్తి గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారి ఉత్సవాలకు బుధవారం నిర్వాహకులు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా తొలి రోజు స్వామి వారు రజితకవచాలంకృత బాల గణపతిగా దర్శనమిచ్చారు. స్వామివారికి సాయంత్రం వాహన సేవను నిర్వహించి పూజలు చేశారు. ఆలయంలో ఏర్పాటు చేసిన అద్దాల గణపతి ప్రత్యేక సెట్టింగ్‌ను భక్తులను ఆకట్టుకుంది. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు తదితర ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. తొలి రోజు దుపాటి రాజ్యలక్ష్మమ్మ శిష్య బృందం చేసి సంకీర్తనాగానం నిర్వహించారు. గురువారం శ్రీ వెంకటేశ్వర భక్త సమాజంచే ప్రత్యేక సంకీర్తనా కార్యక్రమాన్ని జరిపారు. ఆలయంలో కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గ్రంధి శ్రీనివాసరావు, మామిడి లక్ష్మీవెంకటకృష్ణారావు పర్యవేక్షించారు.

మరో ప్రజా ఉద్యమానికి సిద్ధం కావాలి : సీపీఎం



మాట్లాడుతున్న సత్యబాబు

వించిపేట(విజయవాడపశ్చిమ):రాష్ట్రంలో పెరిగిన విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్లను ప్రతిఒక్కరూ తిప్పికొట్టాలని సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు ప్రజలకు పిలుపునిచ్చారు. సీపీఎం పశ్చిమ నగర్ కమిటీ ఆధ్వర్యంలో 50వ డివిజన్ మహంతిపురంలోని ఖాదర్ సెంటర్లో గురువారం విద్యుత్ అమరవీరుల 25వ వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ 2000సంవత్సరంలో చంద్రబాబు ప్రభుత్వం బషీర్‌బాగ్ వద్ద విద్యుత్ చార్జీలను తగ్గించాలని ఆందోళన చేస్తున్న వారిలో ముగ్గురిపై కాల్పులు జరిపి పొట్టన పెట్టుకుందని గుర్తుచేశారు. ఆఘటనలో వందలాది ప్రజలు గాయాలపాలయ్యారన్నారు. నాటి పోరాట ఫలితంగానే రాష్ట్రంలో 15ఏళ్లపాటు ప్రజలపై విద్యుత్‌భారం పడలేదని పేర్కొన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఇప్పటికే ప్రజలపై విద్యుత్‌చార్జీల రూపంలో రూ.16వేల కోట్ల భారం మోపిందని, మరో రూ.12వేల కోట్ల భారం వేసేందుకు సిద్ధమైందన్నారు. అమరవీరుల పోరాట స్ఫూర్తితో త్వరలో ప్రజాఉద్యమం చేపడుతామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఈ.వి.నారాయణ, నగర కమిటీ సభ్యులు పి.రాజు, కరిముల్లా, నాయకులు జి.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం



యుగంధర్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వ్యాయామ విద్య విభాగాధిపతి, డాక్టర్ డి.యుగంధర్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. శారీరక దారుఢ్య ప్రాధాన్యం, యోగా, ధ్యాన, వ్యాయామ పద్ధతులను, వాటి ప్రయోజనాల గురించి వివరించారు. క్రీడలకు ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలను తెలియచేశారు. విద్యార్థులు కేవలం విద్యకే పరిమితం కాకుండా క్రీడల్లో రాణించాలని సూచించారు. అలాగే క్రమశిక్షణ వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను విశ్లేషించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్యారమ్స్ పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. తొలుత దేశం గర్వించదగ్గ హాకీ క్రీడా మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సుధారాణి, డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ సుమిత్ర, సత్యవాణి, లావణ్య, నాగలక్ష్మి, దివ్య తదితరులు పాల్గొని మాట్లాడారు. అనంతరం డాక్టర్ యుగంధర్‌ను శాలువాతో సత్కరించారు.

అధ్యాపక ఉద్యోగాలకు దరఖాస్తులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాలలోని తాత్కాలిక వసతిలో కొనసాగుతున్న కంచికచర్ల సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో అధ్యాపక ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకుల కళాశాలలో గణితశాస్త్రం, వాణిజ్యశాస్త్రం (కామర్స్), కంప్యూటరు అప్లికేషన్స్ విభాగాల్లో అతిథి అధ్యాపక పోస్టులను భర్తీ చేయనున్నామన్నారు. సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్ డిగ్రీ, తత్సమాన విద్యార్హత కలిగి కనీసం 55శాతం మార్కులతో ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేయటానికి అర్హులు అన్నారు. జాతీయ/ రాష్ట్రస్థాయి అర్హత పరీక్ష (నెట్/స్లెట్) ఉత్తీర్ణులు, ఎంఫిల్/పీహెచ్‌డీ పట్టభద్రులకు ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు వచ్చేనెల ఒకటో తేదీ కళాశాలలో నిర్వహించే మౌఖిక పరీక్షకు విద్యార్హతల ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 97052 93208 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

దోమకాటు నుంచి రక్షణకు చర్యలు

పటమట(విజయవాడతూర్పు): దోమకాటు నుంచి ప్రజలను రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగరంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అన్ని విభాగాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయా శాఖాధిపతులతో గురువారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. విస్తారంగా కురుస్తున్న వర్షాల వల్ల మాన్సూన్ రెస్పాన్స్ టీం (ఎంఆర్‌టీ) అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సిబ్బంది మూడు షిఫ్టులలో 24 గంటలూ పని చేస్తూ రోడ్ల పైన నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తీసేయాలని తెలిపారు. ప్రజారోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ నిల్వ ఉన్న నీళ్లలో యాంటీ లార్వే ఆపరేషన్లు నిర్వహించాలన్నారు. డ్రోన్ సర్వేలెన్సు ద్వారా ఖాళీ స్థలాల్లో నీటి నిల్వలను గుర్తించి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దోమల వల్ల ప్రజలకు ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తనివ్వకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూ యాంటీ లార్వే ఆపరేషన్లు, ఫాగింగ్ చేయాలన్నారు.

మధురంగా సాగిన వీణా వాద్య కచేరీ



వీణపై వాగ్గేయకారుల సంకీర్తనలు పలికిస్తున్న ధూళిపాళ శ్రీనివాస్

విజయవాడకల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి 10వ వార్షికోత్సవం సందర్భంగా దుర్గాపురంలోని సంస్థ కార్యాలయంలో గురువారం నిర్వహించిన వీణా వాద్య కచేరీ శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటింది. విఖ్యాత సంగీత విద్వాంసులు ధూళిపాళ శ్రీనివాస్ వాగ్గేయకారులు ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, సద్గురు త్యాగరాజ స్వామి రచించి స్వరపరచిన సంకీర్తనలను వీణపై మధురంగా పలికించారు. మహాగణపతి రవతుమాం, బ్రోవభారమా, స్వరరాగ సుధారస తదితర కీర్తనలు ఆలపించారు. సంగీత కళాశాల మృదంగ విద్వాంసుడు పారుపల్లి సుబ్బరాయఫల్గుణ్ మృదంగంపై హెచ్ఎన్ భాస్కర్ వయోలిన్‌పై, గుంటూరు సంగీత కళాశాల అధ్యాపకుడు బి.హరిబాబు ఘటంపై సహకరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆకాశవాణి టాప్ గ్రేడ్ సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ విలువలతో కూడిన కార్యక్రమాలను నిర్వహిస్తున్న శ్రీ సుబ్రహ్మణ్య సంగీత సమితి నిర్వాహకులను అభినందించారు. సంస్థ కార్యదర్శి సీవీరావ్ సంస్థ లక్ష్యాలను వివరించారు. సంస్థ వైస్ చైర్మన్ చిట్టా రామలక్ష్మి నిర్వహించారు. సంగీత కార్యక్రమం నిర్వహించిన విద్వాంసులను నిర్వాహకులు సత్కరించారు.

పట్టుదలతో సాగితే విజయాలు సొంతం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):విద్యార్థులు వ్యాపారరంగంలో పట్టుదలతో ముందుకు సాగితే చక్కని విజయాలను సొంతం చేసుకోవచ్చని నేషనల్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ లిమిటెడ్ డెప్యూటీ మేనేజర్ రాజ్‌కమల్ పేర్కొన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో 'ఎంటర్‌పెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సపోర్టింగ్ ఫస్ట్ జనరేషన్ ఎంటర్‌పెన్యూయర్స్' అనేఅంశంపై కళాశాలలో గురువారం సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా రాజకుమాల్ మాట్లాడుతూ విద్యార్థులకు అనేక అవకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మొదటి తరం వ్యాపారులకు అనేక సవాళ్లు, అవకాశాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం విద్యార్థులకు వ్యాపార రంగానికి సంబంధించి నూతన ఆవిష్కరణలు అందించే వారికి, స్టార్టప్స్‌ను ప్రారంభించే వారికి ప్రభుత్వం అందించే సహకారాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ వి.చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.


జర్నలిస్టుల హౌసింగ్ ప్రాజెక్ట్‌ను కొనసాగించాలి



సీఆర్డీఏ కమిషనర్‌ను కలిసిన జర్నలిస్టు ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీ రాజధాని అమరావతిలో జర్నలిస్టుల హౌసింగ్ ప్రాజెక్టును తిరిగి కొనసాగించాలని జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు సీఆర్డీఏ కమిషనర్‌కు విన్నవించారు. ఈ మేరకు గురువారం సీఆర్‌డీఏ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ కన్నబాబును కలిశారు. ఈ సందర్భంగా అమరావతి జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు సొసైటీకి సంబంధించి పలు అంశాలను కమిషనర్‌కు వివరించారు. గత టీడీపీ ప్రభుత్వం బహుళ అంతస్తుల హౌసింగ్ ప్రాజెక్ట్ నిమిత్తం మందడంలో 30 ఎకరాలు భూమి కేటాయించిందని, సర్వే నంబర్లతో భూమిని సొసైటీకి ఎలాట్‌మెంట్ చేసిందన్నారు. ఇందుకు సంబంధించిన ఎలాట్‌మెంట్ లెటర్‌ను కమిషనర్‌కు అందజేశారు. టీడీపీ ప్రభుత్వం 2014–19 మధ్య కాలంలో జర్నలిస్ట్ లకు అమరావతిలో ప్రతిపాదించిన హౌసింగ్ ప్రాజెక్ట్ ను తిరిగి కొనసాగించి ప్రభుత్వమే బహుళ అంతస్తుల భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. గతంలో కేటాయించిన భూమిని తిరిగి ప్రభుత్వానికి అప్పగించడం జరిగిందని, ప్రభుత్వం కొంత రాయితీతో హ్యాపీ నెస్ట్ మోడల్‌లో నిర్మిస్తామని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఆ ఉత్తర్వులు కాపీని కమిషనర్‌కు అందజేశారు. ఇదే విషయమై ఇటీవల మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణను కలిసినట్లు తెలిపారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ ఈ అంశాన్ని మంత్రి వర్గ ఉపసంఘంలో పెడతామని సొసైటీ ప్రతినిధులకు తెలిపారు. కమిషనర్ కన్నబాబును కలిసిన వారిలో అమరావతి జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి పాటిబండ్ల నాగశ్రీనివాసరావు, సొసైటీ డైరెక్టర్ చావా రవి, సీనియర్ జర్నలిస్ట్ దారం వెంకటేశ్వరరావు, ప్రెస్ ఫోటో గ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు సాంబశివరావు తదితరులు ఉన్నారు.

కృష్ణలంక రైతుబజార్ తనిఖీ



కర్నూల్ ఉల్లిపాయలను పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ సీఈఓ మాధవీలత

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంక రైతుబజార్‌ను మార్కెటింగ్ శాఖ సీఈఓ కె.మాధవీలత గురువారం తనిఖీ చేశారు. రైతుబజార్ పరిసరాలను, అన్నీ స్టాల్స్‌ను పరిశీలించారు. కర్నూలు నుంచి దిగుమతి అయిన ఉల్లిపాయల నాణ్యతను పరిశీలించి వాటి అమ్మకాల గురించి ఆరా తీశారు. రైతుకార్డులను, డ్వాక్రా, సొసైటీ కార్డులను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే వ్యాపారులు కూరగాయలు విక్రయిస్తున్నారా లేదా అని వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. రైతుబజార్‌లో ప్లాస్టిక్ కవర్ల నిషేధం కచ్చితంగా అమలు జరపాలని, ప్లాస్టిక్ కవర్లు వినియోగించకుండా స్టాల్స్ యజమానులకు అవగాహన కల్పించాలని ఎస్టేట్ అధికారిని ఆదేశించారు. ఎల్లప్పుడు రైతుబజార్ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు ఓ.శ్రీనివాసరావు, ఏడీఎం బి.రాజాబాబు, ఎస్టేట్ అధికారి జాన్ విక్టర్ పాల్గొన్నారు.